౧

# ఎఱ్ఱచీర

విశాలాక్షి గుండెలు గుబగుబలాడాయి!! పంజాబ్ మెయిల్ నెప్పుడూ చూడకపోయినా, ఆ శబ్దాన్ని వినకపోయినా, ఆ సమయంలో ఆమె గుండెల చప్పుడలాగే వుందని ఎవరైనా భావిస్తారు! ఆమే అలాగే అనుకుంది.

అలా.... వళంతప్పి కొట్టుకున్న గుండెలతో తన రూమ్‌లోకి వచ్చి తలుపు ఛళ్ళునవేసి, పిడికిట్లో సగంనలిగిన కాగితాన్ని టేబిలుమీదికి విసిరి, గుండెలమీద చేతులు పెట్టుకుని రెండు నిమిషాలలాగే వుండిపోయింది విశాలాక్షి.

కాస్త భయం, గాభరా తగ్గాక వెళ్ళి టేబిల్‌మీద కాగితాన్ని చేతిలోకి తీసుకుని దానివంక చూసి "ఎంత ధైర్యం అతనికి?" అనుకొంది. మరీ ఆలశ్యమైపోతుందని మనసు తొందరపెట్టడం ప్రారంభించాక, వణికీవణకని చేతుల్తో కాగితాన్ని విప్పింది విశాలాక్షి....

"చూడండి.... చెయ్యకూడని పనులు చెయ్యడమంటే మనుషుల కిష్టం....

ఇలా ఓ అందమైన అమ్మాయికి వుత్తరంరాసి, ధైర్యంగా అందజేయడం తప్పని నాకు తెలుసు....

....ఐనా ఆలోచనల్ని అణచుకోలేకా, మనసుని జయించలేకా రాస్తున్నాను....

గరల్స్ హాస్టల్లో చివరి రూమ్‌లో మీరుంటున్నారుకదూ ? మీ రూమ్‌కి కుడిపక్కనున్న కిటికీలోంచి ఎదురుగాచూస్తే ఒక తెల్లని మేడ వుంది.... ఆ మేడమీద గదివుంది.... ఆ గదిలో నేనున్నాను.... కొద్ది కాలంక్రితంవరకూ, యూనివర్సిటీలో ఎమ్మే చదివాను.... ఈ మధ్యనే ఎమ్మే సెకండ్ క్లాసులో ప్యాసయినట్టు యూనివర్సిటీవాళ్ళు డిక్లేర్ చేశారు....

ఈ వూళ్ళో చాలాకాలంనించీ వుంటున్నా, ఈ గదికి నే నొచ్చి రెణ్ణెల్లే కావస్తుంది. ఆ వచ్చిన రోజునే మిమ్మల్ని మీ రూమ్ కిటికీలోంచి చూశాను. అంతకంటే.... మీరావేళ కట్టుకున్న ఎర్రచీరతో చూశాననడం బాగుంటుంది.

....ఎర్రని పెర్లిన్ చీరంటే నాకెంతో ఇష్టం. సంతోషమంత.... ఆప్యాయమంత ఇష్టం.... ఇంకా ఎక్కువ.... చెప్పలేనంత ఇష్టం....! ఆవేళ మీకు తెలియకుండానే.... అటూ ఇటూ కదలాడే ఎర్రచీరతోబాటు మిమ్మల్నిచూశాను.... ప్రపంచాన్నీ, నన్నూ, అన్నిటినీ, అందర్నీ మర్చిపోయి,ఆలోచనల్నీ,అంతరంగాన్నీ,పనుల్నిపక్కకునెట్టేసి మరీచూశాను..

ఎప్పుడూ ఎన్నడూ ఎరగని ఊహాతీతమైన భావాలు నన్నావేళ చుట్టుముట్టేయి....

ఎర్రని అందమైన దానిమ్మ గింజలమధ్య మల్లెపువ్వులు అమర్చినట్లున్న మీరు ఆ రోజే నా హృదయంమీద చెరగని ముద్రవేశారు.

ఆ తరువాత.... ఎప్పుడూ మీ కోసం, మీతోబాటు ఎర్రచీరకోసం వెతికిన కళ్ళు రెండు మూడు మార్లు మాత్రం సంతృప్తిని పొందాయి!

మిమ్మల్ని ప్రేమించానని, మీరే రోజూ కలల్లోకొస్తున్నారనీ పిచ్చి పిచ్చిగా రాయడం నా కిష్టంలేదు.... కాని ఎర్రచీర కట్టుకున్న మీరంటే మాత్రం నాకు.... ప్రాణంకన్న ఎక్కువ!

కనీసం మీ ముఖ పరిచయమైనా నాకులేదు. ఐనా మీరంటే....

రేపు ఆదివారం రాత్రి ట్రెయిన్‌లో నేను ఇంటర్‌వ్యూ కని బొంబాయి వెళ్ళిపోతున్నాను. ఈ వూరిలో నాకు మిగిలిపోయిన కోరిక యీ ఒఖటే!

ఆఖరిసారి మిమ్మల్ని ఎర్రచీరలోచూడ్డం.... అందుకే ఆదివారం సాయంత్రం ఆరుగంటలకి ఆ చీర కట్టుకొని బీచికొస్తారు కదూ....! మీరు మీ ఫ్రెండ్స్‌తో వచ్చినా నా కభ్యంతరంలేదు.... కాని మనసారా ఎర్రనిచీరతోపాటు మిమ్మల్ని చూడ్డం నా ఆఖరి ఆశ....

మరో విధంగా భావించరనే తలుస్తాను....

మీ పేరు తెలియక పోవడంవల్లే ఎలా సంబోధించాలో తెలిసింది కాదు. క్షమించండి....

చక్రవర్తి."

* * *

ఉత్తరం చదవడం పూర్తిచేసి, నిట్టూర్చింది విశాలక్షి.

ఏమాలోచించాలో, ముక్కూ, మొహం, పేరూ తెలియని 'అతని' గురించి ఏమనుకోవాలో ఆమెకి తెలిలేదు.

తల నొప్పిగా వుందని క్లాసు నుంచి హాస్టల్‌కి వచ్చేస్తూంటే హాస్ట లెదురుగా వున్న తెల్ల మేడలోంచి పదేళ్ళ పనిపిల్ల వచ్చి ఆ కాగితాన్నిచ్చి "మీ కిచ్చేయమన్నారు"అనేసి మాటైనా వినకుండా వెళ్ళిపోయింది. అదృష్ట వశాత్తు రోడ్డుమీద జనంఎక్కువమందిలేరు. ఉన్నవాళ్ళెవరూ దీన్ని గమ నించలేదు. ఆ కాగితాన్ని పారేద్దామనుకుంది విశాలాక్షి. కాని చేతులు రాలేదు. ఎందుకో చదవాలనిపించింది.... వణికే చేతుల్తో, కదిలే గుండెల్తో గబగబా రూమ్‌కివచ్చి వుత్తరం చదివేసింది విశాలాక్షి....!

ముచ్చటగా ముద్దొస్తున్న గులాబీరంగు కాగితంమీద నల్లటి ఇంకులో శ్రద్ధగా అందంగా అమర్చినట్టున్న అక్షరాలన్నిట్నీ చదివేసింది విశాలాక్షి....

విశాలాక్షి కెవరూ ఇలాంటి వుత్తరాన్ని కాని.... ఇంతకుమించిన ప్రేమలేఖల్నిగాని ఇప్పటిదాకా రాయలేదు....

ఇరవైయేళ్ళ విశాలక్షికీ అనుభవం మొదటిసారి.

కథల్లో ఎక్కువసార్లు, కలల్లో తక్కువసార్లు ఇలా చదివింది, చూసింది విశాలాక్షి. కాని నిజజీవితంలో విశాలాక్షి కెవరూ ఇలాటి ఉత్తరాన్ని ఆమెను మెచ్చుకుంటూ రాయలేదు. "ఇరవై యేళ్ళ వయసుండీ, పట్నంలో బి ఎస్సీ చదువుతున్న విశాలాక్షికి.... తెల్లని విశాలాక్షికి.... ఎవరూ ఉత్తరం రాయనే లేదా?....ఉహు....రాసేవుంటారు" అని చాలామందికి అనిపించవచ్చు. ఐనా విశాలాక్షికీ అనుభవం కొత్త.... కారణం.... విశాలాక్షి వయసులోనే వున్నా.... పట్నంలో చదువుతున్నా, తెల్లగావున్నా అంతబావుండదు....!

అలాగని విశాలాక్షి అనాకారికాదు....కాని ఆ లేని అనాకారితనానికి అబ్బాయిల్ని పిచ్చెక్కించే ప్రేమలేఖ రాయడానికి పురిగొల్పే శక్తిలేదు. అందుకే విశాలాక్షి కొన్నాళ్ళు బాధపడేది....

తను పి.యు.సీ.లో వుండగానే తన క్లాస్‌మేట్ సరస్వతికి తమ సీనియర్ వుంగరాల జుత్తబ్బాయి ప్రేమలేఖ రాసినప్పుడూ....ఫస్టియర్‌లో వున్నప్పుడు పక్కరూమ్‌లోవున్న అరుణని దేవానంద్ లాటబ్బాయి ప్రేమించి సినిమాలకీ, పిక్నిక్కులకీ తీసుకెళ్ళినప్పుడు.... విశాలాక్షికి దాదాపు ఏడుపొచ్చింది.

అందర్నీ అందరూ కాకపోయినా, ఎందరో చాలామంది అమ్మాయిలని అబ్బాయిలూ, అబ్బాయిల్ని అమ్మాయిలూ ప్రేమిస్తున్నారు.... "కాని తన్నెవరూ ప్రేమించరేం....?" అని కించపడేది విశాలాక్షి. ఆఖరికి "ఛ! నేనంతందంగా వుండనుకాబోలు...." అని సమాధాన పరుచుకుని, అప్పటికి నిట్టూర్చి.... ఓపికున్నంతవరకూ విచారించేది ప్రేమించడానికి చాలినంత అందంలేని విశాలక్షి....

కాని ఇన్నాళ్ళకు.... మూల పడేసినవీణ నెవ్వరో తీసి మ్రోగించి నట్టూ, తంత్రులు సరిచేసినట్టూ ఐంది....

విశాలాక్షి తలనొప్పిపోయింది.... విశాలాక్షి మనసిప్పుడు చాలా సంతోషంగా వుంది. "ఆ అబ్బాయి తనను ప్రేమిస్తున్నాడు కాబోలు. ప్రేమించకపోతే అలా ఎందుకు రాస్తాడు??"

ఇన్నాళ్ళకు తనను ఒక అబ్బాయి ప్రేమిస్తున్నాడు. విశాలాక్షి అద్దం దగ్గిరికివెళ్ళి అద్దంలో చూసుకుంది....

తన కళ్ళల్లో తనకే తెలియని కాంతి, అప్రయత్నంగా మెరిసిన చిరునవ్వులో, ఏవో అందాలూ....

"నేనూ అందంగానే వున్నాను" అనుకుంది విశాలాక్షి. మోడైన హృదయం చిగిర్చిన విశాలాక్షి.

అరే! అసలు సంగతి తను మరిచిపోయింది. రేపే ఆదివారం....

ఇంతకూ ఆ ఎర్రచీర తనదికాదు. తన రూమ్మేట్ సరళది. రెండు మూడుసార్లు సరదాగా తనే ముచ్చటపడి కట్టుకొంది. ఎర్రచీరంటే తనకూ ఇష్టమే....

ఇప్పుడు ఎర్రచీరంటే తనకి మరీ యిష్టం....

ఫరవాలేదు.... రేపు సరళనడిగి తీసుకోవచ్చు....

అసలింతకీ ఆ వుత్తరం సరిగ్గా తనకే ఎలా ఇచ్చిందో ఆ పని పిల్ల....?

పొద్దున్న గదిలోంచి ఏ చీర కట్టుకువెళ్ళానో చూసుంటాడతను— మళ్ళీ వచ్చేదాకా పాపం వేచివుంటాడు కాబోలు....!"

తనకోసం ఇంత శ్రమించిన ఒక మగప్రాణి వుందంటే విశాలాక్షికి చాలా సంతోషంగావుంది.... చెప్పలేనంత.... ఎవరూ ఊహించలేనంత సంతోషంగావుంది.

విశాలాక్షి కుర్చీలో కూర్చుని వుత్తరం మరోమారు చదివింది,దాన్ని జాగ్రత్తగా పెట్లో దాచేసి, మళ్ళీ కూర్చొని ఏదో ఆలోచించ నారంభించింది.... చల్లనిగాలి వీస్తుండగా ఇరవైయేళ్ళ విశాలాక్షి మనసులో ఈ ప్రపంచంలో ఎవరూ సాధించలేని విజయం సాధించినంత సంతోషం కలగ నారంభించింది.

* * *

ఉదయం ఎనిమిది గంటలకు నిద్రలేచిన విశాలాక్షి "ఆదివారం వచ్చేసింది" అనుకొంది సంతోషంగా ఆరాటంగా....

ఆమెమనసులో ఇప్పుడు ఆకాశమంతసంతోషంవుంది. ఆమె ఆలోచనలో సముద్రమంత ఆరాటముంది. గబగబా కాలకృత్యాలు ముగించుకొని పుస్తకం చేత్తోపట్టుకూర్చొంది విశాలాక్షి....

"ఏమిటోయ్ ! ఇవాళా చదువే? మార్నింగ్‌షోకి పోదాం రారాదూ అంది సరళ....

విశాలాక్షి ఏదో చెప్పేంతలో బయట అడుగుల చప్పుడు వినబడింది. ఇంతలో వార్డెన్ గదిలోకి వచ్చింది.

"అమ్మాయీ ! విశాలాక్షీ.... మీ అన్నయ్యగారోలు విజయనగరం నుంచి వచ్చారు.... నిన్ను చూడాలట. కింద విజిటర్స్ రూమ్‌లో వున్నారు రా !" అంది.

"ఉండవోయ్ మళ్ళీవస్తాను" అని సరళతో చెప్పేసి క్రిందకు వెళ్ళింది విశాలాక్షి.

"ఏవమ్మా ! బావున్నావా?" అన్నాడు కింద గదిలో కూర్చున్న అన్నయ్య.

"ఊఁ" అంది విశాలాక్షి.

"సుభద్రమ్మగారికి బొత్తిగా కనపడ్డం మానేశావుట" అన్నాడు రామారావు.

సుభద్రమ్మ రామారావు అత్తగారు. రామారావ్ విశాలాక్షన్నయ్య.

వాళ్ళంటే విశాలాక్షికి అసహ్యం. మనుషులకొద్దీ, ఆప్యాయత మీటర్లలో కొలిచి మరీవాలకబోస్తారు....

ఆవిడకీ మిగతావాళ్ళకీ.... విశాలాక్షంటే అసూయా, కోపం.... హాస్టల్లోవుంటూ చదువుకుంటున్నందుకూ, పోకిరీ వేషాలేస్తుందని అభిప్రాయం వున్నందుకూ.... !

"అమ్మ నాన్నల దగ్గర్నుంచి వుత్తరాలొస్తున్నాయా?" అన్నాడు రామారావు.

"ఊఁ"

సరే! అలావెళ్ళి మాట్లాడుకుందాం రా! ఓసారి నువ్వు వాళ్ళని చూసినట్టూ వుంటుంది." అన్నాడు రామారావు. విశాలాక్షికి వస్తాననక తప్పింది కాదు.

"సరే, వుండు గదికి వెళ్ళొస్తాను." అని చెప్పి గదిలోకి వచ్చింది విశాలాక్షి.

సరళ కప్పుడే చీర సంగతి చెప్పేస్తే సరి.... కాని.... ఎలా చెప్పడం? యేం బావుంటుంది....? ఐనా సరళ ఎక్కడికి వెళ్తుంది కనక? వెళ్ళినా ఆచీర ఆపెట్లోనే వుంటుందిగా? ఆ మాత్రం అడక్కుండా చీర తీసుకునే చనువూ, అధికారం తనకు లేకపోలేదు.

"నేను మార్నింగ్ షోకి వెడుతున్నానోయ్! మధ్యాహ్నం కలుద్దాం! మరి నీకిప్పుడు తీరికలేదుగా! సారీ. గుడ్‌లక్! నాదగ్గరో తాళంవుంది. నువ్వు తాళం వేసుకుని వెళ్ళిపో! వస్తాను బైబై ...." అంటూ మరో ఫ్రెండ్‌కోసం కాబోలు.... పక్క రూమ్‌కి వెళ్ళింది సరళ.

విశాలాక్షి కంతా ఆరాటంగావుంది.

తలుపు తాళంవేసి కిందకువచ్చి "పదన్నయ్యా....!" అంది.

ఆ మధ్యాహ్నం విశాలాక్షి సుభద్రమ్మగారింట్లో భోంచేయక తప్పింది కాదు....

ఓ పక్క మొహమాటం.... బిగువూ.... బిడియం....

మరోపక్క సాయంత్రం గురించి ఆరాటం.... తొందర....

భోంచేశాక ఓ అరగంట కూచొని పనుందని అందరి దగ్గరా సెలవు తీసుకుని వచ్చేసింది విశాలాక్షి.

"వచ్చేవారం మళ్ళీ కలుస్తాన్లే.... జాగ్రత్తగా చదూ!" అన్నాడు రామారావు.

"ఊఁ" అనేసి వచ్చేసింది విశాలాక్షి.

* * *

"నీ కోసం చూసి, ఇందాకే ఓ పావుగంట క్రితం వాళ్ళ బంధువులింటికి వెళ్ళింది సరళ." అంది పక్క రూము భానుమతి.

"అరే" అని గదివైపు చూసింది విశాలాక్షి. తాళం కప్ప విశాలాక్షిని వెక్కిరించింది. విశాలాక్షి వాచీ చూసుకుంది. మూడైంది. తాళం తీసి గదిలో ప్రవేశించింది. తను ఆరుగంటలకి పార్కు కెళ్ళాలంటే సరళ కనీసం ఐదుకైనా యిక్కడుండాలి....కాని....సరళ సంగతి తనకి తెలుసు. బంధువులతో ఆదివారం బైటకెడితే భోజనాల టైమ్‌కికాని రాదు....

"ఐతే ఇప్పుడెలా?.... ఫరవాలేదు. ఆ పెట్టె తాళంలాటిదే మరోటి తనదగ్గరే వుంది. చీరతీసుకోవచ్చు" .... అనుకుంది విశాలాక్షి.

అనుకోకుండా విశాలాక్షికి మళ్ళా తల నొప్పి ప్రారంభమైంది. కాస్త అమృతాంజనం పట్టించుకొని ఐదుగంటలకి అలారంపెట్టి బెడ్ మీద వాలింది విశాలక్షి....

* * *

విశాలాక్షి బరువుగా కళ్ళుతెరిచే సరికి గదిలో సగం వెలుగుతో బాటు చీకటికూడా ఆక్రమించింది.

తలలో ఎవరో సుత్తులతో సున్నితంగా కొడుతున్నారు. విశాలాక్షి వెంటనేలేచి టైము చూసింది. వాచీ నాలుగున్నరదగ్గర ఆగిపోయింది.

వెంటనే రిస్టు వాచీ చూసుకుంది. ఆరూ పది నిముషాలైంది. తలలో సుత్తులు ఇప్పుడు బరువుగా కొట్టడం మొదలెట్టాయి!

"అరెరే!" అనుకొంది విశాలాక్షి. వెంటనే పక్కమీంచి లేచింది.

ఆరాటం, ఆతృత, భయం, విసుగు, కోపం....

గబగబా ముఖం కడుక్కొని సరళపెట్టె తెరిచింది విశాలాక్షి. దేవుడు తనమీద పగ తీసుకుంటున్నట్టు అనిపించింది విశాలాక్షికి. పెట్టంతా కళ్ళురిగేట్టు గాలించినా, ఎర్రచీర ఎక్కడా కనబడలేదు విశాలాక్షికి....

విశాలాక్షి కేంచేయాలో తోచలేదు....

వాచీ ఆరూ ఇరవై చూపిస్తోంది....

ఆరాటం! భయం! కోపం! విసుగు.... విశాలాక్షి....!

అరెరే! ఇప్పుడెలా? ఇప్పుడెలా....?

తలనొప్పి! గుండెల్లోదడ.... అర్థంలేని ఆత్రుత.... విసుగు!!

ఇప్పుడెలా? ఇప్పుడేం చేయాలి?.... ఇప్పుడేం చేయాలి? ఏదో చెయ్యాలి? ఎలాగైనా అక్కడికి వెళ్ళాలి. పోనీ ఏదో ఓ చీర.... ఏం చేయడం మరి.... మరి వెళ్ళకపోతే అసలు ప్రమాదమే! అతను? అతన్ని కలుసుకోవాలి.

లేకపోతే రేపతని ప్రయాణం.... వెళ్ళాలి....! వెళ్ళాలి.

విశాలాక్షి లేచి ముఖం కడుక్కొంది.... తనకున్నవాటిలో గులాబీ రంగుచీర.... కాస్త వెలిసిపోయింది.... కట్టుకుంది విశాలాక్షి.

ఓ పక్క వొళ్ళు స్వాధీనం తప్పిపోతోంది. మనసులో ఏదో చెప్పలేనిబాధ!!! ఆరాటం....

ఏమైనా వెళ్ళాలి.... అనుకుంటూ రూమ్ తాళంవేసి మెట్లుదిగింది. బరువైన మనసుతోనే బలవంతంగా శక్తి తెచ్చుకుంటూ, జోరుగా బీచ్ వైపు నడిచింది విశాలాక్షి.... అనుకున్నది జరగని విశాలాక్షి.... ఏమవుతుందోనని ఆత్రుతతో గుండెల్ని అరచేతిలో పెట్టుకున్న ఎర్ర చీరంటే ఎంతో ఇష్టపడ్డ విశాలాక్షి....

* * *

బీచి బిజీగావున్న హృదయంలా సందడిగా వుంది.... చంటిపిల్లల దగ్గర్నుంచి, చరమదశ ఎంతోదూరంగా లేనివాళ్ళవరకూ అందరూగాలినీ, ఆనందాన్ని ఆస్వాదిస్తున్నారు....

విశాలాక్షి తొందరగా పార్కులోకి ప్రవేశించింది. టైము ఆరున్నరైంది. చీకటి వెలుగు ఒకే సరిహద్దును చేరుకున్నట్టున్నాయి! ప్రకృతికి ఇద్దరు కవలపిల్లలు పుట్టినట్టు వెలుగు చీకటీ-కలసి ఒకేలాగున్నాయి!

ఒక్కసారి విశాలాక్షికి దూరంగా లీలగా ఎర్రచీర కనబడింది.

"ఔను! సందేహంలేదు. ఆమె సరళే! అనుకుని గబగబా సరళ వద్దకు నడిచింది విశాలాక్షి.

"సరళా....!"

"హల్లో విశాలా ? మధ్యాహ్నం ఏమైపోయావోయ్ ! నీకోసం చూసి చూసి మా వాళ్ళతో వాళ్ళింటికెళ్ళి ఇలా వచ్చేశాను. పోనీలే ఏమైతేనేం వచ్చావుగా ?" అంది సరళ అందంగా నవ్వుతూ.

విశాలాక్షి మనసక్కడ లేదు....

అతను.... అతన్నెలా పోల్చుకోవడం ?

తనే ఎర్రచీరకట్టుకోవాల్సిన వ్యక్తినని ఎలాచెప్పడం ? ఎలా....? ఇప్పుడెలా ?....

"ఏమ్ విశాలా? ఏమిటాలోచిస్తున్నావ్ ?" అంది సరళ. విశాలాక్షి ఉలిక్కిపడి సరళకేసి చూసింది.

ఎర్రచీరలో సరళ ధగధగా మెరిసిపోతోంది. తనలాగే రెండు జడలు. దాదాపు తనంతే పొడుగు.... విశాలాక్షి మనసులో ఏదో అవ్యక్తమైన ఆలోచన మెరిసింది. ఎడంకన్నొక్కసారి అదిరింది...."

మీ మీ.... ఇసకా, పార్కు, సముద్రం.... మనుషులూ, అన్నీ అందరూ అదిరారు....!!!

"ఏమ్ ! అది సరేకాని ఓ చిన్న గమ్మత్తు చెప్పనా అంది" సరళ.

"ఊఁ" అంది మనసుని స్వాధీన పర్చుకోవడానికి ప్రయత్నిస్తూ విశాలాక్షి.

"ఇందాక.... నేను మా కజిన్స్‌తో బీచికొచ్చినప్పుడు అంటే వాళ్ళూ ఇప్పుడిక్కడే వున్నారనుకో !" అంటూ నాలుగడుగుల దూరంలో కూచున్న మరో ఇద్దరమ్మాయిల్ని చూపించింది సరళ.

"వాళ్ళతో మాట్లాడుతున్నాను. ఇంతలోకి ఎవడో బ్రూట్ దగ్గరగా వచ్చి మాట్లాడబోయాడు. మళ్ళీ మానేశాడు. చూస్తే పెద్దమనిషిలా గున్నాడని "ఏమి"టని మామూలుగా అడిగాను. అప్పుడు ఏమన్నాడో తెల్సా—

ఎఱ్ఱచీరలో మీరెంతో బావున్నారు. నా మాట కొట్టేయ కుండా ఇలా వచ్చినందుకు చాలా థాంక్స్. జీవితాంతం మిమల్ని మర్చిపోలేను. మీ పేరుకూడా చెబితే కృతజ్ఞుణ్ణి" అనింకా ఏదో అనబోయాడు.

"ఆఁ! అప్పుడేమైంది?" అనడిగింది విశాలాక్షి కంగారుగా.... ఆమె మనసులో అప్పుడే ఎవరో వెయ్యి డైనమైట్లు పుట్టించారు....

"ఏముందీ- మర్యాదగా మాట్లాడు మిస్టర్! పిచ్చిగా వాగవద్దని ఇంకా బాగా చీవాట్లుపెట్టి పంపించాను.... మా కజిన్స్‌కూడా బాగా దులి పేశారనుకో! వెంటనే వెనక్కి చూసుకుంటూ వెళ్ళిపోయాడు పాపం.... అని వెంటనే "ఏయ్! అదుగోవాడే!" అంది పార్కుపైనున్న కిల్లీకొట్టు కేసి చూపిస్తూ సరళ.

విశాలాక్షి కంగారుగా అటు చూసింది.

అప్పుడే టర్నింగ్ తిరిగి ఎఱ్ఱటి ఇంజన్‌తోవున్న పదోనంబరు బస్సు ఆగింది. పార్కుపైన కిల్లీకొటు దగ్గర్నుంచి తెల్లటి పాంట్‌లో నల్లటి సిల్కు షర్ట్ టక్‌చేసిన ఓ ఆకారం దిగులుగా, నీరసంగా— బస్‌వైపు నడిచింది.

"వాడే! బ్రూట్. అసల్లషర్టు...." అంది సరళ.

విశాలాక్షికి పరిగెత్తుకువెళ్ళి అతని చేతులుపట్టుకు ఆపాలనిపించింది.

అన్నీ వివరంగా చెప్పేసి క్షమాపణ కోరుకోవాలనిపించింది. అప్రయత్నంగా కళ్ళవెంట నీళ్ళుకారి ఆరిపోయాయి విశాలాక్షికి. వెంటనే సరళ వెనక్కి వెళ్ళిపోయింది.

"ఏమోయ్, ఏమైంది?" అంది సరళ విశాలాక్షివైపు తిరుగుతూ....

సరళ ఎఱ్ఱచీరపైట గాలికి విలాసంగా ఎగురుతోంది.... ఎగురు తోన్న ఎఱ్ఱపైటలోంచి, మెల్లగా కదిలినబస్సు స్వప్న శిఖరంలోంచి జారిపోయిన యదార్థంలాగ కనిపించింది విశాలాక్షికి. విశాలాక్షికి కన్నీ ళ్ళాగలేదు....

ఆమెతోపాటు ఆమె మనసు కార్చిన కన్నీళ్ళలో మధురమైన భావాలన్నీ తడిసి ఎటో కొట్టుకుపోయాయి! హృదయంలో లెఖ్ఖలేనన్ని డైనమైట్లు బద్దలవుతున్నాయి. అంతా పీడకలలులాగ.... అందరూ శత్రువుల్లాగా సయనైడ్‌లో ముంచిన కత్తుల్లాగా కనబడుతున్నారు....సముద్రమంతా తనమీదకే కొట్టుకొచ్చినట్లయింది.

"అరరే! ఇదేమిటి విశాలా? కన్నీళ్ళు!" అంది సరళ. దీనంగా సరళవైపు చూసింది విశాలాక్షి.

సరళ కట్టుకున్న ఎర్రచీర, కన్నీళ్ళలోంచి రక్తపుముద్దలా కనిపించింది విశాలాక్షికి........